క్లుప్తంగా

హెచ్ఐవీ లేని సమాజం స్థాపించాలి



పోస్టర్‌తో అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

అద్దంకి: రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు హెచ్ఐవీ లేని సమాజంగా తయారు చేసేందుకు కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. మంగళవారం బొమ్మనంపాడులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం, (దిషా) హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. నాగేంద్రమ్మ, సర్పంచ్ పద్మావతి, వైద్య అధికారులు డాక్టర్ జయసింభ, డాక్టర్ కేవీ చౌదరి, సీహెచ్‌వో పద్మ, ప్రోగ్రాం మేనేజర్ దుర్గ, సురేంద్ర, టి. దుర్గాభవాని పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీకి ఫ్యాన్లు అందజేత



కాలేజీకి ఫ్యాన్లు అందిస్తున్న కేవీ శేషుబాబు

చీరాల అర్బన్: పట్టణంలోని యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి ఆంధ్రాబ్యాంక్ రిటైర్డు మేనేజర్ కేవీ శేషుబాబు నాలుగు సీలింగ్ ఫ్యాన్లను ప్రిన్సిపాల్ ఎస్.మురళికి అందించారు. కళాశాల అభివృద్ధి నిమిత్తం, విద్యార్థినుల సౌకర్యార్థం సీలింగ్ ఫ్యాన్లు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డు మేనేజర్ కేవీ శేషుబాబుకు కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు.

వేటపాలెం తహసీల్దార్‌గా గీత



తహసీల్దార్ గీత

వేటపాలెం: వేటపాలెం తహసీల్దార్‌గా గీత మంగళవారం పదవీబాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన పార్వతిని సీసీఎల్ఏకు సరెండర్ చేశారు. అప్పటి నుంచి చీరాల తహసీల్దార్ గోపికృష్ణ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ అన్నారు. మంగళవారం ఈపురుపాలెంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

సముద్ర నాచు పెంపకంతో లాభాలు



సముద్రనాచు పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చినగంజాం: సముద్ర నాచు పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశాలున్నాయని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు పి. గాలిదేముడు అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫిషర్‌మెన్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ వారి సహకారంతో పెదగంజాం పల్లెపాలెంలోని సచివాలయంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కె. శ్రీనివాస్ నాయక్ సముద్ర నాచు ఉత్పత్తి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. భావదేవరపల్లి ఎంవీకేఆర్ మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. అనుపమ, జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి. కృష్ణకిషోర్, ఇకో వేవ్ ఓషన్స్ ఎండీ మాధవి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం. రవీంద్ర, ఏపీఎం పెద సుబ్బారావు, సర్పంచ్ నక్కల కృష్ణ పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితమైన జీఎస్టీ తగ్గింపు

అద్దంకి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ప్రకటనలకే పరిమితం అయిందని సీఐటీయూ నాయకుడు తంగిరాల ఓ ప్రకటలో తెలిపారు. ఈ నెల 22 నుంచి ఎక్కడా తగ్గించిన దాఖలాలు లేవని.. తగ్గింపు బోర్డులు కనిపించలేదని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

మేదరమెట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని అలా ఎవరైనా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్‌రఫీ హెచ్చరించారు. మంగళవారం మేదరమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్ ద్వారా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అనాలోచితం.. అవస్థలమయం!



నత్త నడకలో నిర్మాణం జరుగుతున్న హై లెవెల్ బ్రిడ్జి



ఎత్తు లేచిన బ్రిడ్జి

- వర్షాకాలంలో ప్రారంభించిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- మూడు నెలలుగా నత్తనడకనే..
- డెవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకుండానే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్
- రోడ్డు మలుపులు సరి చేయాలని వేడుకోలు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న మూడు మండలాల ప్రజలు, రైతులు

బల్లికురవ: వంతెన నిర్మాణంతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. నాగార్జునసాగర్ పరిధిలో ఉన్న అద్దంకి బ్రాంచ్ కాలువదాటే చోట నిర్మాణం చేస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులు నత్త నడకన జరుగుతుండటమే దీనికి కారణం. వేసవిలో చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణ పనులు వ్యవసాయ సీజన్‌లో చేపట్టి తమన ఇబ్బందులు పాలు చేస్తున్నారని బల్లికురవ సంతమాగులూరు అద్దంకి మండలాల్లోని 30 గ్రామాల ప్రజలు రైతులు, వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ – అద్దంకి ఆర్ అండ్‌బీ రోడ్డు లోని వల్లాపల్లి– ధర్మవరం గ్రామాల మధ్య అద్దంకి బ్రాంచి కాలువను దాటే చోట 33/0 వద్ద పాత బ్రిడ్జి స్థానంలో నూతన హై లెవెల్ బ్రిడ్జికి గాను జూన్ నెలాఖరులో రూ1.65 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జూలై మొదటి వారంలో పాత బ్రిడ్జిని పడేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఆరంభం నుంచి నత్త నడకే...

ఆర్అండ్ బీ, ఎన్ఎస్పీ అధికారుల మధ్య సమన్వయం లేక పోవడంతో తుది దశ పనులు పూర్తయి రాకపోకలు జరగాలంటే మరో 20 రోజులు పైగా పట్టే అవకాశాలున్నాయి. జూలై మొదటి వారంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. 40 రోజుల్లో పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తామని అధికారులు ప్రకటించారు. ఈలోపు అద్దంకి బ్రాంచ్ కాలువకు నీటి విడుదల లేకుండా చేసి పనులు చేయిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ వేసిన డైవర్షన్ రోడ్డు తీసేసి నీరు కిందకు పంపారు. ఈ దశలో పనులకు పది రోజులు పాటు బ్రేక్ పడింది

దశాబ్ద కాలంలో 20 మంది మృత్యువాత

నూతన బ్రిడ్జి కిరువైపులా రోడ్డు మలుపులున్నాయి. ఈ మలుపులను సరిచేసి బ్రిడ్జి తూర్పు, పడమర భాగాల్లోని గోడలనుఎత్తు లేపాలని వాహన చోదకులు, ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ మలుపుల వల్ల గత దశాబ్ద కాలంలో ఇక్కడ అనేక ప్రమాదాలు సంభవించి 20 మంది పైగా చనిపోయారు. 40 మంది వరకు గాయాల పాలయ్యారు. పనులు నత్త నడకతో పాటు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయనందున బల్లికురవ సంతమాగులూరు అద్దంకి మండలాల్లోని 30 గ్రామాల ప్రజలు, రైతులు, వాహన చోదకులు అధిక వ్యయ ప్రయాసలకోర్చి చుట్టూ తిరిగి గమ్యం చేరుతున్నారు. తుది దశ పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని వేడుకుంటున్నారు.

పనుల సీజన్లో బ్రిడ్జి నిర్మాణం ఏమిటి?



వేసవికాలంలో చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణ పనులు అధికారులు కాంట్రాక్టర్ అనాలోచిత చర్యతో వ్యవసాయ పనులు సీజన్లో చేపట్టి రైతులు ప్రజలు వాహనచోదకులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. తక్షణమే తుదిదశ నిర్మాణ పనులు పూర్తి చేయటంతో పాటు బ్రిడ్జికిరువైపులా గోడలను ఎత్తు పెంచాలని మలుపులను సరి చేయాలని అప్పుడే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చన్నారు.

కె. అంజనీ ప్రసాద రెడ్డి: వైఎస్సార్ సీపీ, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి

వైభవంగా సారె పంపిణీ



పొంగళ్లు వెంట తీసుకొని బయలు దేరి వెళుతున్న మహిళా భక్తులు



డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరిన గ్రామ కాపులు, పెద్దలు



సారె పంపిణీ ఊరేగింపులో భారీగా పాల్గొన్న గ్రామంలోని మహిళా భక్తులు

చినగంజాం: మండలంలోని రాజు బంగారుపాలెంలో మంగళవారం గ్రామ దేవతలకు సారె పంపిణీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు సారె పంపిణీ ప్రథమ వార్షికోత్సవం కావడంతో గ్రామ కాపులు, పెద్దలు సమక్షంలో గ్రామంలోని మహిళలు సుమారు 500 మందికి పైగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. పొంగళ్ళు సిద్ధం చేసుకొని పానకం, వడపప్పు, సద్ది వెంట తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించుకుంటూ మేళతాళాలతో, డీజే సౌండ్స్‌తో రంగులు చల్లుకుంటూ, వేప ఆకులు చేత ధరించి, భక్తి శ్రద్ధలతో నృత్యాలు చేసుకుంటూ గ్రామ దేవతల వద్దకు చేరుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. రాజుబంగారుపాలెం గ్రామ దేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ, జాలమ్మ, అంకమ్మ తదితర దేవతలకు సారె సమర్పించారు. గ్రామంలో మంగళవారం ఉదయం మొదలు కొని సాయంత్రం వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతల వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించిన అనంతరం సామూహికంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా 3 వేల మందికి పైగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ నిర్మాణానికి రూ.1 లక్షకు పైగా ఆర్థిక సాయమందించి నిర్మాణం పూర్తి చేసిన దాత కందేపి చంద్రశేఖర్‌రావును సన్మానించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దళిత నాయకులు

మార్టూరు: మండలంలో డేగరమూడిలో స్థానికులు ఏర్పాటు చేసుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం దళిత నాయకులు డిమాండ్ చేశారు. అంటరానితన నిర్మూలన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చార్వాక ఆధ్వర్యంలో డేగరమూడికి చెందిన సుమారు 50 మంది దళితులు మంగళవారం ఉదయం మార్టూరు సీఐ ఎం. శేషగిరిరావును కలిసి విజ్ఞప్తి చేశారు. స్టేషన్ వద్ద చార్వాక మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కోసం గ్రామస్తులు తీసుకున్న పంచాయతీ తీర్మానం సరిపోదు అంటూ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఎవరికి తెలియపరచకుండా విగ్రహాన్ని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ కాలనీవాసులు అంబేడ్కర్ కమిటీగా ఏర్పడి ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని సైతం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఎవరి ఆదేశాలతో తొలగించారో తేల్చాలని చార్వాక డిమాండ్ చేశారు. విగ్రహ స్థాపనకు అనుమతులు చాలని పక్షంలో కనీసం గ్రామంలో చాటింపు వేయడం ద్వారా స్థానికులకు తెలియజేసే ప్రయత్నం ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుతో సహా ఆతనికి సహకరించిన మిగిలిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రశాంతిని కలిసేందుకు ప్రయత్నించిన దళిత నాయకులకు ఆమె అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంబాబును కలిసి పరిస్థితిని వివరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడంలో తన ప్రమేయం ఏమీ లేదని ఈఓఆర్డీ రామాంజనేయులుతో మాట్లాడాలని రాంబాబు తెలిపారు. ఈఓఆర్డీ రామాంజనేయులకు దళిత నాయకులు ఫోన్ చేయగా ఆయన తాడేపల్లిలో మీటింగ్‌లో ఉన్నానని మార్టూరు వచ్చాక కలిసి పరిస్థితిని వివరిస్తానని తెలిపినట్లు దళిత నాయకులు తెలిపారు. డేగరమూడి ఎస్సీ నాయకులు జెట్టి ఖాజావలి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రమోద్, బెంజిమెన్ పాల్గొన్నారు.

సత్వరం రెవెన్యూ సేవలు అందించండి

చీరాల టౌన్: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ చేయకుండా విచారణ చేయాలని.. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. మంగళవారం చీరాల ఆర్డీఓ కార్యాలయంలో చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దారు, మండల సర్వేయర్లు, రీ సర్వే డీటీలతో రెవెన్యూ సమస్యలు, అర్జీల పెండింగ్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీలు, ల్యాండ్ కన్వర్షన్, నీటి తీరువా వసూళ్లపై మాట్లాడి పలు సూచనలు చేశారు. మండలాల వారీగా అర్హత ఉండి నివేశన స్థలాలు రాని వారి వివరాల నివేదికలు అందించడంతో పాటు కావాల్సిన భూమి వివరాలు అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ ముసలయ్య, తహసీల్దార్లు గోపికృష్ణ, ప్రభాకరరావు, నాగరాజు, రీసర్వే డీటీలు, మండలాల సర్వేయర్లు బసవాచారి, శ్రీను, లోకేష్ పాల్గొన్నారు.

పోషణ లోపం లేని సమాజ స్థాపనకు కృషి



మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీ

చీరాల అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8వ రాష్ట్రీయ పోషణ మాసాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాయని సీడీపీఓ ఝాన్సీ అన్నారు. స్థానిక వైకుంఠపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావిభారత పౌరులన్నారు. వారు సరైన రీతిలో ఎదిగేందుకు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలబాలికల ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నాయన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వివిధ సందర్భాల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణే తమ లక్ష్యమన్నారు. పిల్లల సంరక్షణతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. డాక్టర్ ప్రణయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుముద్వతి, ఏఎన్ఎం సత్యవేదం, హెచ్‌వీ వసంతవల్లి, అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రాణి, పద్మలత, శివనాగమ్మ, సుజాత, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన



ప్రభుత్వ ఆరోగ్య పథకాలు గురించి వివరిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

చినగంజాం: ప్రభుత్వ అందించే ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక పి. సాయి శ్రీ చరణ్, డాక్టర్ వై. భవాని సూచించారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రాజుబంగారుపాలెం ఎస్టీ కాలనీ ఆరోగ్య ఉపకేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మాత శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమం, సమీకృత ఆహారాన్ని తీసుకోవటం గురించి చైతన్య పరచటం, కిశోర్ బాలికలకు బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ గురించి అవగాహన కల్పిస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో అక్టోబర్– 2 వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన.. ఆరోగ్య సేవలను అందిస్తారని తెలిపారు. సీహెచ్ఓ పి. ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు స్వర్ణలత, చిరంజీవి, ఉషారాణి, నర్రా మురళి, 104 డీఈఓ పాదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీలు వసుధ, రమాదేవి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం



హనుమంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ నూతన సభ్యులు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో రోటరీ గంగ భవనంలో క్లబ్ అధ్యక్షుడు బలగం కోటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నూతన సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మద్దినేని హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన సభ్యులుగా ఇడుపులపాడు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పుసులూరి మురళీకృష్ణ, ఇంకొల్లు జెడ్పీ పాఠశాల హెచ్ఎం గోగినేని బాలకృష్ణ, ఇంకొల్లు గ్రామంలోని టైల్స్ వ్యాపారి పెరికల నాగరాజులను రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళలకు లక్కీడిప్‌లు ఏర్పాటు చేశారు. కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరరావు, నిమ్మగడ్డ హనుమంతరావు, ఆర్. రాఘవరాజు, భవనం అంజిరెడ్డి, సోమేపల్లి రామ్మోహనరావు, పావులూరి రాజారామ్మోహనరావు, పేర్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ



భావన్నారాయణ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: స్థానిక శ్రీభూ సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు రెండో రోజు కావడంతో ఉదయం అగ్ని ప్రతిష్ఠాపన, నిత్యహోమం, గ్రామ బలిహరణ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు పరాశరం రామాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సాయంత్రం స్వామిని విశేషంగా అలంకరించి శేషవాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాహనం, ఉత్సవం, ఉభయ దాతలుగా అరవపల్లి రమాకుమార్ జ్ఞాపకార్థం భార్య లక్ష్మీకుమారి, భవానీశంకర్ జ్ఞాపకార్థం భార్య అన్నపూర్ణ, నళినీ కుమార్ భార్య జ్వాలాకుమారి వహించారు.

బంగారు కుటుంబాలపై అవగాహన ఉండాలి



పర్చూరు: పంచాయతీ, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

ఇంకొల్లు(చినగంజాం): సిబ్బంది బంగారు కుటుంబాలపై పూర్తి అవగాహన ఉండాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పీ4 సర్వే కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీ 4 మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, వీ శ్రీనివాసరావు, పర్చూరు నియోజక వర్గ విజన్ 2047 పరిశీలకులు వెంకట్ పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): బంగారు కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శకులుగా ముందుకు వచ్చిన వ్యక్తులు తోడ్పడతారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో మాట్లాడుతూ కుటుంబాల అవసరాలను గుర్తించి అవి పరిష్కారం అయ్యేలా చూడాలని తెలిపారు. ఏఎస్ఓ శ్రీమన్నారాయణ, ఇన్ ప్రొఫెషనల్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షయ వ్యాధితో జర భద్రం



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీరాల రూరల్: క్షయవ్యాధితో జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ స్రవంతి అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని టీబీ యూనిట్ చీరాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరపత్రాలతో ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ ఆరోగ్య కార్యకర్త శ్రీలక్ష్మి, టీబీయూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఘనంగా పూజలు



జాగర్లమూడిలో గాయత్రీదేవి అలంకరణలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారు



మార్టూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు



బతుకమ్మ పూజలు



ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న చైర్మన్ దంపతులు



కారంచేడు గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



పర్చూరు: గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు